

# కూడలి

దేవరాజు మహారాజు

కళ్ళు చదువుతున్నాయి.

గిఫీలుగిఫీలు మని తలుపు బాదిన చప్పుడు. తను వెళ్ళి తలుపు తీసాడు. మనుషుల గుంపు కనబడింది. అకస్మాత్తుగా తన దవడ పగిలింది. గిఫ్ గిఫ్‌న డొక్కలో పోట్లు. నేలమీద కూల బడేట్లు ఒక్క తన్ను. అచేతనంగా వరండాలో తను. కొట్టినవాళ్ళు పారిపోతున్న అడుగులు.

మెడ తిరిగింది. కళ్ళు పుస్తకాన్ని వదిలి తలుపును చూసాయి. బోల్టును చూసాయి. తలుపు వేసే వుంది. బోల్టు పెట్టే వుంది. తను లేవనే లేదు. చూపు దిగి నున్నటి బండలమీదికి జారింది. మళ్ళీ తెల్లని గోడల మీదుగా కప్పు పైకి పాకింది.

ఇటీవల విద్యార్థులు ప్రొఫెసర్లను అలాగే తన్నారు. వాళ్ళ నలా తయారుచేసిం దెవరూ ప్రొఫెసర్లే. మరి తన్ని విడిచిపెట్టడం పరిష్కార మార్గమా?—ఆలోచించాలి.


అసహనంగా లావుపాటి పుస్తకాన్ని టెయ్యి టేబుల్ పైకి విసిరింది. చూపు కిటికీగుండా సాగిపోయి రోడ్డుమీది సిటీ బస్సును, రెండు స్కూటర్లను, కొన్ని సైకిళ్ళను, రిక్షాలను, తాకి, నడుస్తున్న అమ్మాయి అందమైన నడక దగ్గర ఆగి....మళ్ళీ గదిలో కొచ్చేసింది.

పుస్తకాన్ని చేతులు మళ్ళీ లాక్కున్నాయి. విదేశాల్లో అచ్చయిన పుస్తకం తాలూకు నున్నటి పేజీలు. వింత వాసన.

'మీరీ గెడ్డం నా గండానికి పెంచుకున్నట్టుంది. ముక్కులోకి నోట్లోకి పోతున్నాయి








వెంట్రుకలు' — శిల్ప అలా అంటే తనకు చెక్కలిగింత పెట్టినంత ఖుషీ.

'మరి నీ పక్కపిన్నులు-ముక్కుపోగులూ నాకు గుచ్చుకుపోతున్నాయ్ దానికేమంటావ్?'

సముద్రపు కెరటం ఒడ్డును తడిపేసినట్లు పెదాలమీద వెల్డింగ్. చిరుమంటలు.

నల్లటి పొడి అక్షరాలు కలిసిపోయి ముద్దయి, వాక్యాలన్నీ కలిసి నల్లటి చీకటి మరక—పుస్తకంలో చీకటి. కటిక చీకటి. కీచురాళ్ళ రొద. చిన్ని చిన్ని దీపాలు. గోడలమీద నినాదాలు రాస్తున్న యువకుల అసహనం. దీపాలు కదిలిపోతున్నాయి.

కళ్ళ ముందు పేజీలు. పేజీలు వెలుగుతున్నాయి. కూలుతున్న కోటకోడ రాళ్ళలాగా అక్షరాలు. విజ్ఞాన రాజభవనంలోకి తను దారి తీయాలి. వస్తున్న తరాలకు తను మార్గదర్శకుడు. విజ్ఞానం మంచిదే. రాజభవనం చూడతగిందే. కాని డిగ్రీలు, అనుభవాలు, అనుభూతులు కూడు పెట్టవే — అశాంతి. అశాంతి అందుకే.

మొన్నటివరకు అన్నీ తను అనుభవించినవే. ఎంత విలవిల్లాడితే ఈ ఆసరా దొరికింది? తను బావిలో మునిగిపోతున్నాడు. నీళ్ళు మింగాడు. కాళ్ళు గిలగిలా తన్నుకున్నాడు. ముక్కులోకి నీరు పోయి శ్వాసాడడం లేదు. అప్పుడు దొరికింది ఈ అసరా. ఈ తెప్ప. ఈ చెక్కముక్క. ఈ ఉద్యోగం! ఇది పట్టుకుని ఎంతసేపని ఈదాలో? ఎందరికి సహాయ పడాలో?

ఎడమచేయి వేళ్ళు గడ్డంలో వేటగాళ్ళలాగా తిరుగుతున్నాయి. "ఒరేయ్! నీ లొట్టచెంపలు పూడ్చుకుపొయ్యేట్టు నిండుగా ఆ గెడ్డం అలాగే పెంచు" ఫిరోజ్ వీపు చరుస్తున్నాడు. వాడి సిగరెట్ పొగ.

కుడిచేతిలో పుస్తకం. పుస్తకంలో పోత విగ్రహాల్లాగా అక్షరాలు. పాఠ్య పుస్తకాల్లోని పాఠాలు చాదస్తం, మూఢత్వం, గోపురాలుగా వున్న గుళ్ళు! గుళ్ళు....గుళ్ళు....గుండ్లు— గుండ్ల వర్షం కురవాలి.

గుళ్ళు కూలాలి. ఒక పెద్ద గుడి గోపురం

ఫెళఫెళమని విరిగి కూలి పెచ్చులు పెచ్చ లయింది. చలికి రోడ్డుమీద ముడుచుకునే జీవులకు గూళ్ళు కావాలి. పోనీ గుండ్లవర్షం అక్కర్లేదు. గుళ్ళు గూళ్ళు చేస్తే సరిపోయే.

తన మనసునించి, తుపాకి గుండులా దూసుకుపోయింది వాళ్ళ నవ్వు. ఉద్యోగం కోసం ఇంటర్వ్యూలో కూచున్నాడు తను. కమిటీ మెంబర్లు తనను చూసి హేళనగా నవ్వు తున్నారు. ఎన్నిసార్లు ఎక్కడెక్కడో, ఎంద రెందరివో యిలాంటి నవ్వు వింటేగాని ఈ ఉద్యోగం వచ్చింది కాదు. వాళ్ళంతా డబ్బు సుష్టిగా భోంచేసి వచ్చినట్లు పుష్టిగా వున్నారు. గొడ్లు నవ్వుతున్నాయి.

ఈ పనికిరాని చెత్తంతా రేపు పిల్లలకు చెప్పాలి. చూపు అక్షరాల్ని దాటేస్తూ పోవడం లేదు. అక్షరాలు చుట్టే తిరుగుతోంది. పనికి రానిదని తనకు తెలుసు. వాళ్ళకు తెలుసు. కాని వుత్తుత్తగానే చదువుకోవాలి. వుత్తుత్తగానే చెప్పుకోవాలి. వుత్తుత్తగానే నవ్వుకోవాలి. పనీ పాట లేక వుత్తుత్తగానే రోడ్లమీద బతుకుతుం డాలి. ఆఖ్‌, థూ నీ యవ్వ బతుకు——

పుట్టింట్లో బోరుకొడుతోంది. సెలవు చూసు కుని వూరికెనె ఓసారి రండీ——శిల్ప వుత్తరం. శిల్ప గారాబం. పిల్లల్ని కనబోయేవాళ్ళ కోరి కల్లా శిల్ప కళ్ళు మిలమిలా మెరుస్తున్నాయి. పూర్. పూర్. పూర్ శిల్ప. శిల్ప ప్రపంచం చిన్నది. తను కావాలని ఆ పూరి గుడిసెలోంచి తెచ్చుకున్నాడు. శిల్ప మొదటి పేరు రంగమ్మ. ఈ నాగరిక సమాజానికి తగినట్టుగా తను ఆమె పేరు మార్చుకోకుండా వుంటే తన భార్య పేరు రంగమ్మ. ఎంత ఘోరంగా వుండేది.

సినిమా హాల్లో——వెండి తెరమీద, తెర నిండా, స్తనాలు. స్తనాలు కదులుతున్నాయి. అరనిమిషం తర్వాత కింద కటిభాగం, నున్నటి తొడలు, తొడలమధ్యలోంచి దూసుకుపోయింది కెమెరా కన్ను——దూరంగా లేచి పడుతున్న సముద్రపు అలలు. బ్యాక్‌గ్రౌండ్‌లో ఫలాని డ్రింకే తాగండి! వెస్టరన్ మ్యూజిక్‌లో చిరుగు తున్న గొంతుల పాట సముద్రపు ఒడ్డున నగ్నసుందరి! డ్రింకు తాగుతూ——


రోడ్డుమీద లారి హారన్ అసహ్యంగా పారి పోయింది. కళ్ళముందు పుస్తకం, పుస్తకంలో కొట్టొచ్చినట్టు అక్షరాలు. చదవాలి రేపటి క్లాసు కోసం. తల్లి వేరునుండి విడిపోతున్న పిల్ల వేళ్ళు——ఆలోచనలు! చేతిలో పుస్తకం. సెక్రటేరియట్ ముందు నిరాహార దీక్ష చేస్తూ సొమ్మసిల్లిపోయిన విద్యార్థుల్లాగా వాక్యాలు. పోలీసు ఫైరింగ్‌లో అక్కడికక్కడే కుప్ప కూలి చచ్చిన కాలేజీ కుర్రాళ్ళ లాగా ఫుల్ స్టాప్‌లు.

చూపు పుస్తకం మీదినుండి టేబుల్‌మీదికి గెంతి, నేలమీద గచ్చుబండలమీద వగిలింది. ఛడేల్‌మని స్ప్రింగ్‌డోర్ తెరుచుకుని బుల్లెట్ల లాగా లోనికొచ్చిన ఆరుగురు విద్యార్థులు. ప్రొఫెసర్ మెడలు అణగబెట్టి, అతని కళ్ళ ముందే అతని పరిశీలనలో యూనివర్సిటీకి సబ్మిట్ చేయబడ్డ థీసిస్‌లు, రీసెర్చి పేపర్లు, పుస్తకాలు తగలబెట్టారు. ప్రొఫెసర్ పక్షపాత వైఖరి, కులతత్వం, ప్రాంతీయ తత్వం, కుతం త్రాలు అన్నీ ఆ మంటల్లో దగ్ధమౌతున్నాయి. ప్రాణభయంతో ప్రొఫెసరు! అతని కంట్లో మండుతున్న మంటల ఛాయలు....గచ్చుబండ మీద మంటలు. అలాంటివే మంటలు, అలాంటి వారే ప్రజలు. అసెంబ్లీలో మంటలు, పార్ల మెంటులో మంటలు.

చూపు తలుపుమీదికి పోయింది. చేతిలో నున్నటి పేజీలమీది సల్లటి' అక్షరాలమీదికి పోయింది. From the dorsal side arises the Posterior pancreatico duodenal artery which passes to the duodenal loop and pancreas చూపు మళ్ళి, చేతి గడియారాన్ని టికటిక మని తొలిచింది. 'ఫారూ... థీ వండ్ల పాడి' వెధవ భారతిలో అడ్వర్‌టయిజ్‌మెంట్. హోటల్ సరోవర్‌లో చుట్టూ జంటల మధ్య తను ఒంటరిగా కాఫీ తాగుతున్నాడు. ఎదురు సీట్లో వాళ్ళిద్దరు.








ఆమె భుజాలమీదుగా జారిపోతున్న చీజ్ కాటన్ శర్టుమీద అతను చెయ్యేసి, కళ్ళద్దా ల్లోంచి నీలి నీలిగా చూస్తూ——'హైద్రాబాద్‌లో ఎక్కడికైనా వెళ్ళు మంచి టీ దొరుకుతుంది' ——ఇంగ్లీషులో పోజు. గంట కట్టిన జంతువు లాగా తెల్లని ముఖానికి నల్ల కళ్ళద్దాలు. జంతు వులు. హోటల్ టేబుళ్ళముందు అన్నీ జంతువులు. దేశం నిండా ప్రపంచం నిండా జంతువులు. దున్నపోతులకు పూలదండ లేసి పండగ మా మూళ్ళు అడుక్కుంటున్నారు. దున్నల మెళ్ళో గంటలు! సరాల్ని కుదిపి ఎత్తి పడేస్తున్న డప్పు చప్పుడు. ఢం ఢం కి కియాం కి యాం. ఢం ఢం కి కియ్యాం కియ్యాం.

కళ్ళు ఎంతసేపటికి పుస్తకం గట్లమీదే తిరుగుతున్నాయి. లోనికి దిగడం లేదు. దిగితే బురదే——లేదు లేదు. తను అలా కాకూడదు. ఆ ప్రొఫెసర్ల స్థితికి తను దిగజారకూడదు. అలాంటి బతుకు తన కక్కర్లేదు.

యువజనాన్ని చైతన్యవంతులుగా చేసే వాడి నవ్వాలి. వారికో దారి చూపించేవాడిలాగా కావాలి. కూడలిలో ఎలక్ట్రిక్ సిగ్నల్ స్థంభం లాగా, పక్షపాతం లేకుండా వుండాలి. అందు కోసం ఈ యూనివర్సిటీ సిలబస్‌లు చదవడం అనవసరం.

చప్పున మూసి పుస్తకం టేబుల్‌పై గిరా టేసాడు తను. పాఠ్య పుస్తకం శవంలా కూలింది. జీవిత సమరం కోసం సిద్ధంగా మరి కొన్ని పుస్తకాలు, వీరుల్లా షెల్ఫ్ నిండా నిల బడి వున్నాయి.

